

రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

భూసేకరణ అనుమతులకు ప్రభుత్వానికి నివేదిస్తాం

- రిజర్వాయర్ పనులను వేగవంతంగా చేయాలి
- సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల పరిశీలనలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి

వర్ని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్లూయిస్‌ల నిర్మాణానికి అటవీ భూమి అవసరం అయితే భూ సేకరణ అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద కొనసాగుతున్న రిజర్వాయర్ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి పరిశీలించారు. నీటి ప్రవాహం తో కూడిన వాగులు, ఎత్తిన కొండ ప్రదేశాలను కాలి నడకన దాటుతూ రిజర్వాయర్ బండ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్లూయిస్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలం విషయమై రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదం నెలకొని ఉన్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. టోపో షీట్, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా స్థల నిర్ధారణ కోసం ఆయా రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్థల వివాదానికి సంబంధించిన అంశాల పై బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ఇతర అధికారులతో చర్చించారు. పరస్పర సమన్వయంతో సర్వే పూర్తి చేయాలని ఇరు శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అప్పటి లోగా రిజర్వాయర్ పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్, ఎఫ్.డీ.వో సుధాకర్, తహసీల్దారు సాయిలు తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా

ఆర్మూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అన్నారు. మంగళవారం మండలంలోని చేపూర్‌లోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి విధుల్లో పాల్గొనే ప్రెసిడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రెసిడింగ్ అధికారులు ప్రతీ నిమిషం అప్రమత్తంగా ఉండి ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తు ఎన్నికలు సజావుగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఆర్మూర్, ఆలూర్ ఎంపీడీవోలు శివాజీ, గంగాధర్, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో రాజ్‌గంగారాం, ఆర్పీలు రాము, సంగెం అశోక్, గంట అశోక్, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ నగరంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన గాంధీ గంజ్ వ్యాపారులను మార్కెట్ కమిటీకి చెందిన ముఖ్య నేత ముప్పు తిప్పలు పెడుతున్నాడు. ఏళ్ల కాలం నుంచి గాంధీ గంజ్‌లో కూరగాయల దుకాణాలతో పాటు ఇతరులకు సొంత వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఏడాది క్రితం ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గానికి చెందిన ముఖ్య నేత కన్ను గాంధీ గంజ్‌పై పడింది. గంజ్ నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్న వ్యాపారులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ్యంతో నెలరోజుల పాటు గంజ్ గేట్లను మూసివేసి తీరా వ్యాపారులు కోర్టుకు వెళ్లడంతో హైకోర్టు గేట్లు తెరవాలని స్టే ఇచ్చింది.

గాంధీ గంజ్‌లో.. గలీజ్ దందా..!

మార్కెట్ యార్డులో వ్యాపారులకు ముప్పు తిప్పలు

- నెల పాటు గేట్లను మూసివేసిన మార్కెట్ కమిటీ
- హైకోర్టు స్టే ఇవ్వడంతో తిరిగి తెరిచిన అధికారులు
- వ్యాపారులతో ముఖ్యనేతకు కుదరని డీల్
- ఏకపక్ష నిర్ణయంతో మార్గం మూసివేత
- బయటకొస్తున్న వసూళ్ల పర్వం

నిజామాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని మార్కెట్ కమిటీ ఆధీనంలో కూరగాయల దుకాణాల సముదాయం ఉండగా ఇతరుల ఇళ్లలో వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వారి వ్యాపార సముదాయాలకు నిత్యం వేలాది మంది వస్తుంటారు. ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి గోషాలవైపు గాంధీ గంజ్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. వ్యాపార సముదాయాల యజమానులను ఇబ్బంది పెట్టి తన దారికి తెచ్చుకోవాలనుకున్న ముఖ్య నేత డీల్ కుదరకపోవడంతో వారిని ఇబ్బంది పెట్టాలని నెలరోజుల పాటు గేట్లను మూసివేశాడు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న వ్యాపార సముదాయాల యజమానులు కలెక్టర్‌తో పాటు కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చారు.

గేట్ మూసివేత..

గాంధీ గంజ్ చుట్టుపక్కల ఉన్న వీక్లీమార్కెట్, మిర్చికంపౌండ్, తదితర ప్రాంతాల నుంచి ఎవరు మృతి చెందినా గాంధీగంజ్ మధ్య నుంచే దుబ్బలోని సార్వజనిక్ శ్మశాన వాటికకు వెళ్లడం ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తుంది. నెలరోజుల పాటు గాంధీగంజ్ గేట్లు మూసి ఉంచగా ఆ సమయంలో ఒకరు మరణించడంతో ఆ కుటుంబ సభ్యులు గాంధీ గంజ్ సెక్యూరిటీతో గొడవ పడి మరి గేట్లను తెరిపించారు. అనంతరం గేట్లను మూసివేయడంతో ఆప్రాంత వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

బెడిసి కొట్టిన రాయబారం..

ఈ విషయంలో తనకు ఎంతో కొంత ఇచ్చుకుంటే గేట్లు తెరుస్తానని ముఖ్య నేత శ్రద్ధానంద్ గంజ్‌లోని ఓ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధితో రాయబారం పంప గా వ్యాపార సముదాయాల యజమానులు ససేమీరా అనడంతో కథ అడ్డం తిరిగింది. హైకోర్టు గేట్లు తెరవాలని ఆదేశాలు ఇవ్వడంతో చేసేదేమి లేక సదరు నేత గేట్లు తెరవాల్సిన పరిస్థితి వచ్చింది. సదరు నేత పాలకవర్గం రాగానే గాంధీ గంజ్‌ను అభివృద్ధి పేరుతో అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతలను గంజ్‌కు తీసుకువచ్చి వ్యాపారులను భయపెట్టే ప్రయత్నం చేసిన కోర్టు తీర్పు ఆయనకు చెంపపెట్టుగా మారింది. శ్రద్ధానంద్ గంజ్‌లో వసూళ్లతో పాటు గాంధీ గంజ్‌లో కూడా వసూళ్ల పర్వం చేద్దామనుకున్న సదరు నేతకు చుక్కెదురైంది.


సొంత మనుషులతో రోజువారీ వసూళ్లు..

నగరంలోని దేవిరోడ్ నుంచి గాంధీ గంజ్ వరకు ఇదివరకు రోడ్డుపై రైతులు, వ్యాపారులు కూరగాయలు విక్రయించేవారు. రోడ్డుపై

మిగతా 8వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికలకు విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ

- ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి



ప్రశ్న: నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ విధంగా సిద్ధమవుతున్నారు?

జవాబు: నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 10 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. 235 గ్రామ పంచాయతీలు, 115 ఎంపీటీసీ స్థానాలు, 9 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల కోసం గ్రామాల వారీగా విలేజ్ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్సై స్థాయి వరకు ప్రతీ గ్రామానికి ఒక పోలీస్ అధికారి ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్ర: నగరంలో దొంగతనాల కట్టడికి ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నారు?

జ: నగరంలో ఇటీవల దొంగతనాల సంఖ్య పెరిగింది. దొంగతనాల విషయంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నాం. విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచుకోకుండా అదే విధంగా సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ పెట్టుకోవాలని ప్రజలకు సూచనలు ఇస్తున్నాం. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు రవాణా వ్యవస్థ ఉండటంతో అంతర్రాష్ట్ర దొంగలు సులువుగా వస్తున్నారు.

ప్ర: రాత్రి వేళ వ్యాపార సముదాయాలను ఏ సమయంలోపు మూసివేయాలి?

జ: నిజామాబాద్ నగరంలో వ్యాపార సముదాయాలు రాత్రిపూట 11గంటలలోపు మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు ఉన్నాయి. ఎవరైనా నిబంధనలకు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- నిజామాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



ఆర్టీసీకి దసరా ధమాకా

- నిజామాబాద్ రీజియన్‌కు కలిసొచ్చిన పండగ
- రాష్ట్రంలో దసరా చాలెంజ్‌లో రెండో స్థానం
- రూ.1.19కోట్లు ఆర్జించిన రోడ్డు రవాణా సంస్థ

7

ఘనంగా వాల్మీకి జయంతి

- వాల్మీకి చిత్రపటం ఎదుట నివాళులర్పించిన కలెక్టర్

8



జడ్జిమెంట్ డే..

నేడు బీసీ 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు



- స్థానిక సంస్థల ఎన్నికలపై న్యాయస్థానం తీర్పుపై సర్వత్రా ఆసక్తి
- ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఔత్సాహికులు

నిజామాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల సంగ్రామానికి ఆరంభంలోనే ఆటుపోట్లు ఎదురవుతున్నాయి. బ్యాలెట్ పోరు పల్లెల్లో రాజుకోకముందే కోర్టు మెట్లెక్కింది. బీసీ రిజర్వేషన్ల అంశంపై పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల ప్రక్రియ కాస్తా మందగించింది. కాగా, బుధవారం కోర్టు తీర్పు ఇవ్వనున్న నేపథ్యంలో అందరూ తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు.

ఆశావహుల ఆసక్తి..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆధారంగా అధికారులు స్థానిక సంస్థల రిజర్వేషన్లను ప్రకటించారు. గతంలో కంటే బీసీలకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ రిజర్వేషన్ స్థానాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం సుప్రీం కోర్టు కూడా బీసీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు కాగా కోర్టు హైకోర్టు లోనే తేల్చుకోవాలని చెప్పడంతో బుధవారం హైకోర్టులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం విచారణకు రానుండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేద్దామనుకుంటున్న ఆశావహులు కోర్టు ఏ విధమైన తీర్పు ఇస్తుందోనని సర్వత్రా ఆసక్తిగా చూస్తున్నారు.

పరిస్థితికి తగ్గట్లుగా వ్యూహాలు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఎస్సీ, ఎస్టీలకు పాత రిజర్వేషన్లను కొనసాగించడంతో జిల్లాలో చాలా చోట్ల జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు గత కొద్దికాలంగా పోటీ చేయాలని ఎదురు చూస్తున్న ఆశావహులకు అనుకూలంగా రిజర్వేషన్లు రాలేదు. దీంతో బుధవారం కోర్టు బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పు ఇస్తుందా? లేదా ప్రతికూలమైన తీర్పు ఇస్తుందా అని ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 31 జడ్పీటీసీలు, 307 ఎంపీటీసీలు

ప్రభుత్వం ఇచ్చిన బీసీ 42 శాతం జీవో ప్రకారం జిల్లా అధికారులు జిల్లాలోని 31 జడ్పీటీసీలు, 307 ఎంపీటీసీలు, 545 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లను ప్రకటించారు. కోర్టు అనుకూలమైన తీర్పు ఇస్తే షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లకు అనుగుణంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఒకవేళ కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే మాత్రం ఎన్నికలు వాయిదా పడటమా? లేదా పాత రిజర్వేషన్లకు అనుగుణంగా ఎన్నికలకు వెళ్తారా? అనేది తేలాల్సి ఉంది.

వేతన వెతలు!

- మూడు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్లకు అందని జీతాలు
- జీతాలు రాక కార్మికుల ఇబ్బందులు
- డొంకేశ్వర్ పరిధిలో రూ.20 లక్షల బకాయిలు

డొంకేశ్వర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాల్లో పనులు చేపడుతున్న ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతం అందక ఇబ్బంది పడుతున్నారు. పనికి వెళ్లిన కూలీలకు నాలుగు నెలలు గడుస్తున్నా వేతనాలు మంజూరు కాలేదు. దీంతో కూలీలు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు సకాలంలో కూలీలకు డబ్బులు అందక ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా మండలంలో 33 గ్రామ పంచాయతీల పరిధిలో చెరువులు, కుంటలు, పంట వరద కాలువలు, మొక్కలు నాటడం తదితర పనులు చేపట్టారు. మండల పరిధిలోని 12,593 జాబ్ కార్డులు ఉండగా అందులో 19,636 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఉమ్మడి మండల పరిధిలో కూలీలకు సుమారు రూ. 20లక్షలకు పైగా వేతనాలు చెల్లించాల్సి ఉంది.

నాలుగు నెలలుగా ఎదురు చూపులు..

ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలిలో పనిచేసిన 15 రోజుల్లోనే కూలీలకు వేతనాలు చెల్లించాలి. కానీ సకాలంలో వేతనాల అందక సంబంధిత శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. త్వరలో అందుతాయి అంటూ అధికారులు సమాధానం చెప్పడంతో నిరాశతో వెళ్లిపోతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని వారు కోరుతున్నారు.

ఎండాకాలంలో పని చేశా..

:నయీమ్, కోమట్‌పల్లి



ఎండాకాలంలో నాలుగు వారాలు ఉపాధి పనులు చేశాను. కూలి ఎప్పటికప్పుడు అందుతుంటే పనికి పోయాము. నాలుగు నెలలు గడిచినా ఇప్పటికి బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

మా పరిధిలో పెండింగ్ లేదు..

:లింగం, ఎంపీడీవో, డొంకేశ్వర్



కూలీలకు వేతనాలు చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. వేతనాలను సంబంధించి అన్ని వివరాలను ఆన్‌లైన్ నమోదు చేశాం. మా పరిధిలో పెండింగ్ ఏమీ లేదు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఖాతాలో పడతాయి.

ఆయుధాలు అప్పగించాలి

- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లైసెన్స్ ఆయుధాలను పోలీస్ స్టేషన్‌లలో అప్పగించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గల లైసెన్స్ పొందినవారు సెక్షన్ 21 ఆఫ్ ఆర్మ్స్‌యాక్టు 1959 ప్రకారం ఆయుధాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఈనెల 9వరకు జమచేయాలని తెలిపారు. ఎవరైనా లైసెన్స్ ఆయుధాలు జమచేయనట్లయితే వారిపై ఆర్మ్స్ యాక్టు ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎవరైతే ఉత్తర్వుల నుంచి మినహాయింపు పొందాలనుకుంటే కమిషనరేట్ కార్యాలయంలోని సంబంధిత అధికారికి రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



బస్టాండ్‌లో తనిఖీలు చేపడుతున్న పోలీసు కమిషనర్ సాయి చైతన్య

పారాహుషార్

- నగరంలో అర్ధరాత్రి పోలీసు కమిషనర్ ఆకస్మిక తనిఖీలు
- రాత్రి వేళ అనవసరంగా బయట తిరిగితే కేసులు తప్పవు : సీపీ

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీస్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి హల్‌చల్ చేశారు. సోమవారం అర్ధరాత్రి నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, శివాజీనగర్, కంఠేశ్వర్, దేవిరోడ్, తదితర ప్రాంతాల్లో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. బయట ప్రాంతాల నుంచి వచ్చి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉంటూ ఎలాంటి కారణం లేకుండా తిరుగుతున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాత్రి సమయాల్లో అనవసరంగా బయట తిరిగితే కేసులు నమోదు చేస్తామని సీపీ సాయి చైతన్య హెచ్చరించారు.

హుస్సామ్.. పసిడి పంచ్

- బీఎఫ్ఐ చాంపియన్‌గా జిల్లా బాక్సర్
- క్రీడాభిమానుల హర్షం

8

ఆర్టీసీ ఆలస్యంపై విద్యార్థినుల గుస్సా

- సమయానికి సర్వీసులు నడపాలని నిరసన
- స్కూళ్లు,కాలేజీలకు ఆలస్యమవుతోందని విద్యార్థినుల ఆవేదన

8

క్యా'రేటు'..!

- కిలోకు రూ.100
- బోరుమంటున్న వినియోగదారులు
- మార్కెట్లో చుక్కలు చూపిస్తున్న ధర

6

క్రైం సమాచారం

వృద్ధురాలిపై కుక్కల దాడి

బీర్కూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంగ్ఏడ్గిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నెల వ్యవధిలో ముగ్గురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఇదిలా ఉండగా మంగళవారం గ్రామానికి చెందిన వృద్ధురాలిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు స్పందించి కుక్కలను తరిమేసి వృద్ధురాలిని కాపాడారు. అనంతరం ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

దోమకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష పడినట్లు ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతున్న పాల్వంచ గ్రామానికి చెందిన జంగం సాంబశివుడు పట్టుబడ్డారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ టి. చంద్రశేఖర్ ఒక రోజు జైలుశిక్షతో పాటు రూ. వేయి జరిమానా విధించారు.

వరద కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి


రాజేందర్(ఫైల్)

కమ్మర్‌పల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ సమీపంలోని ఇందిరమ్మ వరద కాలువలో పడి గల్లంతైన కమ్మర్‌పల్లికి చెందిన కొమిరె రాజేందర్(47) మరణించినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో రాజేందర్ తన దుస్తులకు బురద అంటిందని వరదకాలువలో కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా రాజేందర్ జాడ కనిపించలేదు. మంగళవారం ఉదయం వరదకాలువలో పడిన చోటనే మృతదేహం లభించింది. పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

నవీపేట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో మంగళవారం తల్లెపల్లి వెంకన్న(45) అనే కూలీ మంగళవారం మృతి చెందాడని ఎస్సై తిరుపతి తెలిపారు. ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన వెంకన్న మండలంలోని ఫకీరాబాద్ సమీపంలో జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనులలో కూలీ పని చేయడానికి మంగళవారం మరికొంత మందితో కలిసి వచ్చాడన్నారు. కూలీ పనిలో చేరకుండానే వెంకన్న కూలీ అనుమానాస్పదంగా మృతి చెందాడని, దీనిపై ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

మలేషియాలో తప్పిపోయిన బోధన్ వాసి

బోధన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన ప్యాట విజయ్‌కుమార్(38) మలేషియాలో 4నెలల క్రితం తప్పిపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. తన భర్త జాడ వెతికి ఇండియాకు రప్పించాలని మంగళవారం హైదరాబాద్‌లో బేగంపేట ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ ఎన్ఐఆర్ అడ్వైజరి కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి ఆమెకు మార్గదర్శనం చేశారు. 2025 మే 28న చెన్నై నుంచి కౌలాలంపూర్‌కు చేరుకున్న విజయ్ 2 రోజులు డ్యూటీ చేసిన తర్వాత మానసికంగా కుంగిపోయి అసహనంతో ప్రవర్తిస్తున్నాడని తెలియడంతో అతనిని ఇండియాకు వాపస్ తెప్పించడానికి విజయ్ భార్య జ్యోతి రిటర్న్ టిక్కెట్టు కోసం జూన్ 3న 30వేల రూపాయలు ఏజెంట్‌కు పంపించారు. కానీ జూన్ నుంచి అతడి జాడ తెలియరాలేదన్నారు. గతంలో ఆమె సహాయం కోసం జిల్లా ఎంపీ అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా కలెక్టర్, బోధన్ పోలీసులను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ ఎన్ఆర్ఐ విభాగం నుంచి మలేషియాలోని ఇండియన్ హై కమిషన్‌కు సమాచారం ఇచ్చారని ఈ సందర్భంగా తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి జైలు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన మాణిక్వాడ్ లాలేష్‌కు న్యూసెన్స్ కేసులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ 2రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సోమవారం రాత్రి డయల్ 100 ద్వారా లాలేష్ పోలీసులను విసిగిస్తూ న్యూసెన్స్ చేయడంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కోర్టులో హాజరుపర్చగా జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

సారా విక్రేతకు ఏడాది..

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సారా విక్రయించి పట్టుబడిన కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ మంగళవారం ఆర్మూర్ మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి నెల్లి సరళరాణి తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ తెలిపారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌కు చెందిన పూజారి మౌనిక గతేడాది జనవరి 1న తన ఇంట్లో సారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ ఎస్సై మానస పట్టుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితురాలిని హాజరుపర్చగా పబ్లిక్ ప్యాసిక్యూటర్ ముగ్గురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో మౌనికకు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


కనక స్వామి (ఫైల్)

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కనక స్వామి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)కి చెందిన స్వామి ఇటీవల అక్కడ మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి యాజమాన్యంతో మాట్లాడి స్వగ్రామానికి మృతదేహాన్ని పంపేలా ఏర్పాట్లు చేశామని గల్ఫ్ అసోసియేషన్ నాయకులు కిరణ్‌కుమార్, పెద్ది రవికుమార్, బొమ్మ ప్రవీణ్ తెలిపారు. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగానే ఎన్ఆర్ఐ అధికారి చిట్టిబాబు అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నిజాంసాగర్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మహ్మద్‌నగర్ మండలకేంద్రం శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఉమాకాంత్ హఠాన్మరణం


ఉమాకాంత్(ఫైల్)

బోధన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరాజ్‌పల్లికి చెందిన బోధన్ ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ జంగం ఉమాకాంత్ మంగళవారం గుండెపోటుతో అకాల మరణం పొందారు. ప్రజాప్రతినిధులు, బోధన్ డివిజన్ జర్నలిస్టులు, పలు గ్రామాల పెద్దలు, పలు పార్టీల నాయకులు ఉమాకాంత్ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమాకాంత్ కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. ఆయన మరణం తీరనిలోటని కొనియాడారు.

ముగ్గురికి జైలు, 13మందికి జరిమానా

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. 16 మందిని మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 13మందికి 19,500 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు. మిగతా ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. నగరంలో తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాహనదారులు ఖచ్చితంగా రోడ్డుభద్రతా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. లేకుంటే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యా‘రేట్’ హై..!

మార్కెట్‌లో కిలో ధర రూ.100 ● ముందుకురాని వినియోగదారులు ● అమ్మడానికి వ్యాపారులు సైతం వెనకడగుగు



నందిపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో ప్రతీ నెలా ఏదో ఒక కూరగాయ ధర ఆకాశాన్నంటుతోంది. ప్రస్తుతం మార్కెట్లో క్యారెట్ ధర చుక్కలు చూపిస్తోంది. కిలో క్యారెట్ ధర వంద రూపాయలు పలుకుతోంది. మొన్నటి వరకు నవరాత్రులు కావడంతో ఎక్కువ మంది శాఖాహారం వైపు మొగ్గు చూపడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. అయితే నవరాత్రులు ముగిసిన తర్వాత కూడా కూరగాయల ధరలు మార్కెట్లో నువ్వా-నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నాయి. ఒక్కో వారం ఒక కూరగాయ ధర రికార్డు స్థాయిలో నమోదవుతోంది. నిన్న, మొన్నటి వరకు ఉల్లిపాయలు, టమాట, పచ్చి మిర్చి, చిక్కుడు, వంకాయ ధరలు పెరిగిపోయాయి. సహజంగా మార్కెట్‌లో కిలో క్యారెట్ ధర రూ.20 నుంచి రూ.40కి మించదు. కాని ఈ వారం క్యారెట్ ధర మార్కెట్‌లో వందకు చేరింది. దీంతో మార్కెట్‌లో వ్యాపారులు సైతం దీనిని విక్రయించేందుకు ముందుకురావడం లేదు. వినియోగదారులు సైతం అదే కోవాలో పడ్డారు. కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. అధిక వర్షాలతో బెంగళూరు, ఊటీలో క్యారెట్ పంట దిగుబడులు తగ్గడంతో ఒక్కసారిగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అంతే కాకుండా రోజు కురుస్తున్న అకాల వర్షాలకు క్యారెట్ కుళ్ళిపోవడంతో దిగుమతి తగ్గి, ధర పెరిగిందని ఓ వ్యాపారి ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం


బోధన్, రుద్రూర్ డివిజన్ల అధికారులను సన్మానిస్తున్న డీఈ

బోధన్,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించమే లక్ష్యంగా విధులు నిర్వస్తున్నామని జిల్లా స్థాయిలో బోధన్‌తో పాటు రుద్రూర్ డివిజన్‌లు ప్రతిభ కనబర్చాయని ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. మంగళవారం బోధన్ డివిజన్ కార్యాలయంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన బోధన్, రుద్రూర్ డివిజన్‌ల సంబంధిత అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి సమష్టిగా కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు ప్రభాకర్, నగేష్ కుమార్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలి



వెల్మల్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నేతలు

నందిపేట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఆమెరికా మద్దతుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఐఎం(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజాపోరాటానికి మద్దతుగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెల్మల్‌లో ప్రదర్శన నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా ఆమెరికా తన స్వార్థం కోసం పాలస్తీనాపై దాడులను ప్రోత్సహిస్తోందని దాసు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 60వేల మంది ప్రజలు దాడుల్లో మృతి చెందారని, భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు మద్దతు తెలపాలని, ప్రజాస్వామ్య రక్షణ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి అబ్దుల్, నాయకులు దేవన్న, దొనపల్లి లింగన్న, భాజన్న, గంగారాం, ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రవీణ్


ప్రవీణ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

ఏర్గట్ల, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్తిలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మగ్గిడి ప్రవీణ్ పీఆర్టీయూకు చేస్తున్న సేవలను గుర్తించి సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఇచ్చినట్లు మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన మగ్గిడి ప్రవీణ్‌ను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లాకార్యదర్శి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్టీ కోసం ఒక్కటైన రెండు వర్గాలు


సమావేశంలో పాల్గొన్న ఇరువర్గాల నాయకులు

మోస్రా,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు సమావేశంలో పాల్గొని వర్గవిభేదాలు పక్కనపెట్టారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కోసం అందరూ కలవడం సంతోషంగా ఉందన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, కిసాన్ మోర్చా నాయకులు

ఆర్మూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వరి పంటకు బోనస్ ఇవ్వాలని రైతులు, కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు వినతి పత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో మొక్కజొన్న పంట కోసిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, గత్యంతరం లేక దళారులకు విక్రయించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బాజన్న, ప్రశాంత్, గంగాధర్, బాజన్న, సంజీవ్, రాజశేఖర్, రాజేష్, భాజన్న, తదితరులు పాల్గొన్నారు.

మద్యంషాపులకు దరఖాస్తులు


బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు

బోధన్‌అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 వైన్స్ షాపులున్నాయని, వీటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు తెలిపారు. డివిజన్‌లో ఎస్సీ కోటాలో 2, బోధన్ 1, కోటగిరి 1, గౌడ్స్ 1, సాటాపూర్ 1 రిజర్వ్ చేసినట్లు వెల్లడించారు. రూ.3 లక్షల నాన్ రిఫర్ డీడీతో అక్టోబరు 18 వరకు జిల్లాకేంద్రంలోని డీటీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైన్స్ లక్కీ డ్రాలో పాల్గొనే వారు రూ.3 లక్షల రూపాయల డీడీ చెల్లించాలన్నారు. అక్టోబర్ 23న లక్కీడ్రా తీస్తారని చెప్పారు. కొత్త వైన్స్ షాపులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభం అవుతాయన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు డీడీ, 3 ఫోటోలు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, కాస్ట్ జిరాక్స్ జతపర్చాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ వినోద్

జక్రాన్‌పల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ అన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులకు ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం తెలపవద్దని పేర్కొన్నారు. గ్రామాలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలను పోలీస్‌లకు తెలపాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎండీ మాలిక్ రెహ్మాన్ పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ


చేపూర్‌లో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఆర్మూర్,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కార్ ఓటు చోరీకి పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, పండిత్ పవన్, శ్రీను, వెంకట్‌రాంరెడ్డి, శ్రీకాంత్, రామ్‌సన్, మాజీ ఎంపీటీసీలు గంగాధర్, రంజిత్, సురేష్‌రాజు, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కోర్సులో శిక్షణకు..

ఆర్మూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళ శిశువికాస కేంద్రం(మహిళ ప్రాంగణం)లో కమ్యూనిటీ హెల్త్‌వర్కర్(నర్సింగ్), టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారిణి ఇందిరా కోరారు. 18-35 ఏళ్ల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సింగ్ కోర్సుకు 10వ తరగతి మెమో, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులకు 8వ తరగతి విద్యార్హత, బోనాఫైడ్‌లతో పాటు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈనెల 16 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.వివరాలకు 7660022520,8332949550లోసంప్రదించాలన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


బినోలలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి సమాధి వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి తమ ప్రాంతంలో నడయాడినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. పురోహితులు గణేష్, పాల్గొన్నారు.


పోతంగల్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోటగిరి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): పోతంగల్‌లో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ప్రపంచం ఉన్నంత వరకు వాల్మీకి మహర్షి రాసిన రామాయణం ఆయన చరిత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో రమేష్, ఉదయ్ భాస్కర్, గణేష్, వెంకట్, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాకోర విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు


జి.అరవింద్

వర్ని, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): జాకోర గ్రామానికి చెందిన విద్యార్థి జి.అరవింద్ సిదిపేట జిల్లా ములుగు మండలం లక్కంపల్లిలోని ఆర్‌వీఎం ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు వర్నిలో చదివిన అరవింద్ 5 నుంచి ఇంటర్ వరకు భిక్క నూరులోని గురుకులంలో విద్యనభ్యసించారు. అనంతరం మెడికల్ సైన్స్ రీసెర్చ్ సెంటర్ లక్కంపల్లిలో చేరారు. ఉన్నతరంగంలో రాణి స్తానని అరవింద్ తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏర్గట్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్ధతు ధర అందించేలా చూడాలని మండలంలోని గుమ్మిర్యాల్‌కు చెందిన రైతులు మంగళవారం తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. మొక్కజొన్న పంట చేతికి వచ్చిందని భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు మొక్కొజొన్న నిల్వ చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పంట వర్షంలో తడిసిపోయే ప్రమాదం ఉందని, దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రైతులు సోమ రాజారెడ్డి, ముక్కెర దేవన్న యదవ్, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో పోషణ అభియాన్

ముప్కాల్ ,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారంలో పోషకాల వివరాలను తల్లులకు వివరించారు. ఎంపీవో గౌసిమోహినోద్దీన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, పంచాయతీ సెక్రటరీ మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు

కోటి దీపోత్సవానికి ఆహ్వానం

మోర్తాడ్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెం గ్రామానికి చెందిన వేద పండితులు సాహసం రంజిత్‌కుమార్ శర్మకు శేర్‌లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆహ్వానపత్రికలను అందజేశారు. హైదరాబాద్‌లోని గాజుల రామారంలో నిర్వహిస్తున్న కోటి దిపోత్సవానికి రంజిత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించాలని వారు ఆహ్వానించారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోటగిరి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బాలికల భద్రతపై కోటగిరి పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలో షీటీమ్ ఆధ్వర్యంలో బాలికల భద్రతపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు ఆశన్న, రాధిక, బన్సీలాల్ పాల్గొన్నారు.

వంటశాల నిర్మాణానికి భూమిపూజ

కమ్మర్‌పల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉప్లూర్ శివారులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో వంటశాల నిర్మాణానికి మంగళవారం ఆలయ కమిటీ భూమిపూజ చేసింది. కార్యక్రమంలో సభ్యులు పోలపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, యెనుగందుల శశిధర్, పెంబర్తి నరేష్ కుమార్, పోతు మురళి, పోతు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎస్ మండల అధ్యక్షుడు విజయ్

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ క్లాక్ టవర్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో సీజేఐ బిఆర్ గవాయ్‌పై అడ్వకేట్ దాడి చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నిందితుడు రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజాస్వామ్యం రాజ్యాంగంపై జరిగిన దాడిగా దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు అశోక్, మాజీ జడ్పీచైర్మన్ సదానందం, చంద్రయ్య, పెద్ద బోజన్న, భూమన్న, భూమేశ్వర్, గంగాధర్, రాజన్న, పూర్ణా, చందు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని మున్సిఫ్‌కోర్టు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసనగా న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ లో సమావేశమై న్యాయవాది రాకేష్ కిషోర్ ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యల వల్ల న్యాయవాద వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని ప్రతీ న్యాయవాది ఖండించాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, సదానందం, కిష్టయ్య, అమితాబ్ కిరాడ్, ఆనంద్, చైతన్య పాల్గొన్నారు.

న్యాయవాది సభ్యత్వం రద్దు చేయాలి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 7: (ఆంధ్రజ్యోతి)దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూరి గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమ్మర్‌పల్లి అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం కమ్మర్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో ఏఐవైఎస్ మండల అధ్యక్షుడు సుంకరి విజయ్‌కుమార్ మాట్లాడారు. దేశ ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేయడమంటే దేశప్రజాస్వామ్యంపై, భారత రాజ్యాంగంపై దాడి చేయడమే అవుతుందన్నారు. బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎస్ మండల క్రియాశీలక సభ్యులు కొంటికంటి నరేందర్, పాలెపు రాజేశ్వర్, రామాంజనేయులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీసీవో రామ్మోహన్‌రావు

వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

బాన్సువాడటౌన్ , అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం డీసీవో రామ్మోహన్‌రావు వరి ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2386, రెండవ రకం ధాన్యానికి రూ.2369 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సొసైటీ కార్యదర్శులు, ఆపరేటర్లు తదితరులున్నారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు పెంపు

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ అడ్మిషన్ గడువును ఈనెల 10వ తేదీ వరకు పెంచుతున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రంజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్‌సీ కోర్సులు ఉన్నాయని తెలిపారు. పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంఏలో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, జర్నలిజం కోర్సులు ఉన్నట్లు చెప్పారు. ఎంఎస్సీలో మ్యాథమెటిక్స్‌తో పాటు ఈ సంవత్సరం నుంచి బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు ఎంబీఏలో ప్రవేశం పొందవచ్చని, బీఎల్ఐఎస్సీ కోర్సులు కూడా అందుబాటులో ఉందని వివరించారు. 2024-25 సంవత్సరంలో యూజీ, పీజీలలో అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 10 చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తులు ఎస్‌హెచ్‌వోలో అందజేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాదారుల దరఖాస్తుల రద్దీ దృష్ట్యా నిజామాబాద్, ఆర్మూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దరఖాస్తుదారులు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో స్టేషన్‌లో అందజేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి కోరారు. నిజామాబాద్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబర్ 1 నుంచి 36 వరకు, ఆర్మూర్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబర్- 55 నుంచి 79 వరకు దరఖాస్తులను సుభాష్‌నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పక్కనగల ఎస్‌హెచ్‌వో భవనంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మిగిలిన బోధన్, భీంగల్, మోర్తాడ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాదారులకు సంబంధించిన దరఖాస్తులు యదావిధిగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలోనే దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మిగతా వివరాల కోసం 8712658973 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం పెర్కిట్‌లో నర్సింగ్ 3 నెలల శిక్షణ, టైలరింగ్, బ్యూటీషియన్ నెలరోజుల శిక్షణను ప్రారంభిస్తున్నట్లు దుర్గాబాయి మహిళా శిశు విజ్ఞాన కేంద్రం అధికారి ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం మహిళలు 18-35 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్ శిక్షణ కొరకు దరఖాస్తు చేయడానికి ఎస్సెస్సీ మెమో, టైలరింగ్, బ్యూటీషియన్ కొరకు 8వ తరగతి విద్యార్హత బోనాఫైడ్‌తో పాటు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, 4 పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 16లోపు అందజేయాలని తెలిపారు. వివరాల కోసం 7660022520, 8332949550 నంబర్లను సంప్రదించాలని కోరారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావు

రూరల్ ఎమ్మెల్యేకు పరామర్శ

ఇందూరు, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరామర్శించారు. ఇటీవల భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేలు మంగళవారం నగరంలోని బైపాస్ రోడ్‌లోగల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పత్తికి కుళ్లు.. రైతుకు కన్నీళ్లు

మద్నూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట పాడవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో సాగుచేసిన పంట దిగుబడులు వచ్చే సమయంలో వర్షాలు కురిసి పాడయిపోతున్నందున అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఏడాది తొలకరిలో అనుకూలంగా వర్షాలు కురిసినప్పటికీ దిగుబడుల సమయంలో కురుస్తున్న వర్షాలతో పత్తి కాయలు పూర్తిగా కుళ్లిపోతున్నాయని అన్నదాతలు తీవంకంగా ఆందోళన చెందుతున్నారు.

● **అతివృష్టితో అధిక నష్టం**

ఈ ఏడాది కురిసిన వర్షాలు పత్తికి అనుకూలంగా ఉండగా, అధిక దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు గత రెండు నెలల క్రితం అతివృష్టితో పూర్తిస్థాయిలో నష్టం జరిగే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం అధిక తేమతో కూడిన వాతావరణ పరిస్థితిలో పత్తి కాయకు కుళ్లు, తెగులు, ఆకుమచ్చలు ఆశించే అవకాశం ఉందని మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు సూచిస్తున్నారు.

● **వ్యవసాయ అధికారుల సూచనలు**

వ్యవసాయ అధికారులు పత్తి పంటలో వచ్చే వివిధ రకాల వ్యాధుల నివారణ కోసం పలు సూచనలు చేస్తున్నారు. 0.2 గ్రాము ప్లాంట మైసిన్, 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెబుతున్నారు. అలాగే ప్రస్తుత పరిస్థితిలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉందని, దాని నివారణ కోసం 2 మి.లీ. ప్రొఫినోఫాస్ లేదా 1.5 గ్రాముల థయోడి కార్బ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెబుతున్నారు. రైతులు పత్తిలో ఆల్టేనియా ఆకుమచ్చ తెగులు గుర్తించటానికి ఈ లక్షణాలు ఉంటా యని తెలిపారు. ఆల్టేని యా అనే శిలీంధ్రం వలన ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు వలయాకారపు సుడు లుగా, రింగులుగా ఏర్పడతాయని, తెగులు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు తర్వాత దశలలో కాయల మీద కూడా మచ్చలు కనబడతా య న్నారు. ఈ తెగులు ఎక్కువగా గాలి ద్వారా వ్యాపిస్తుందని మబ్బులతో కూడిన వర్షపు వాతావరణంతో ఈ తెగులు ఎక్కువగా గమనించవచ్చని పేర్కొన్నారు. దీని నివారణ కోసం కిలో విత్తనానికి రెండు కార్బన్ డాజిం లేదా 10 గ్రా. ట్రైకో డేర్మ విరిడి తో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. పత్తి రైతులు చివరి దశలో ఉన్న పత్తిని కాపాడుకోవడానికి వ్యవసాయ విస్తీర్ణం అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు.


అత్యధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట


పంటలో తెగుళ్లు


బీర్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

బీర్కూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం ఆమె బీర్కూర్ మండలంలోని బీర్కూర్, దామరంచ, కిస్టాపూర్, వీరాపూర్, తిమ్మాపూర్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారికి వెంటనే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇళ్లు మంజూరైన వారిలో ఎవరైనా అనర్హులున్నారా అనే దానిపై ఆరా తీశారు. ఆమె వెంట ఎంపీడీవో మహబూబ్, తహసీల్దార్ సాయి భుజంగ రావు, ఆర్ఐ విజయ్, ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు ఉన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలి

ఎల్లారెడ్డి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, ఆశావాహ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యవహారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో వివరించి అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నరేష్, శంకర్ లక్ష్మారెడ్డి, ఎస్ఎన్ రెడ్డి, కాశీనాథ్, నరసింహారెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలతో నష్టం

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలను ద్వారా ప్రజలు మోసపోతున్నారని, అలాంటి వాటిపై నమ్మకం మంచిది కాదని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో కూడా మూఢనమ్మకాలు బాగా పెరుగుతున్నాయని అన్నారు. బాణామతి, చేతబడుల వంటి వాటి పేరుతో అమాయక ప్రజలను పలువురు హింసిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వేముల శేఖర్, బలియ పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా ధమాకా

▸▸ దసరా చాలెంజ్‌లో రాష్ట్రంలోనే రెండవ స్థానం ▸▸ నిజామాబాద్ రీజియన్‌కు రూ.1.19 కోట్ల ఆదాయం

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రీజియన్‌కు దసరా పండుగ కలిసి వచ్చింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలో దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 6 వరకు ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపించారు. రాష్ట్రంలోని దసరా చాలెంజ్‌లో నిజామాబాద్ రీజియన్ ఆదాయంలో రెండో స్థానంలో నిలిచింది. సుమారు 566 ప్రత్యేక బస్సులను నడిపి ఆదాయాన్ని ఆర్జించింది. నిజామాబాద్ జిల్లాకు ఒకకోటి 17లక్షలు టార్గెట్‌ను నిర్ధారించగా రూ. ఒక కోటి 19లక్షల ఆదాయం సమకూర్చుకుంది. సుమారు రూ. 2లక్షల ఆదాయాన్ని అదనంగా ఆర్జించింది. దసరా పండుగ రద్దీని సమర్థవంతంగా ఎదుర్కొని అదనపు సర్వీసులను నడిపింది. నిజామాబాద్ రీజియన్‌లోని 6 డిపోలలో ప్రత్యేక బస్సులను సుదూర ప్రాంతాలతో పాటు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు పల్లెలకు బస్సులను నడిపింది. ప్రయాణికుల రద్దీతో ఆర్టీసీ యాజమాన్యం ఇబ్బందులు ఎదుర్కొన్న ఆదాయంలో మాత్రం రెండో స్థానంలో నిలిచింది. ఆర్మూర్ డిపో 17లక్షల 30వేలు, బోధన్ 28లక్షల 25వేలు, నిజామాబాద్ డిపో-1 24లక్షల 26వేలు, నిజామాబాద్ డిపో-2 24లక్షల 61వేలు, బాన్సువాడ 12లక్షల 55వేలు, కామారెడ్డి 18లక్షల 13వేలు, మొత్తం ఒక కోటి 19లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. పండగ సమయంలో అధిక వాహనాలు నడిపి ప్రజలకు సకాలంలో సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లకు, డిపో సిబ్బందికి ఆర్ఎం జ్యోత్స్న, డీవీఎం మధుసూదన్, సీవో పద్మజ, ఏవో పరమాత్మలు ధన్యవాదాలు తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి బహుమతులను అందజేశారు. ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్టీసీ సిబ్బందితో ఆర్ఎం జ్యోత్స్న

కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

ఎల్లారెడ్డి, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థకు భంగం కలిగే ఎలాంటి చర్యలనైనా తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎల్లారెడ్డి కోర్టు ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై న్యాయవాది దాడి చేసేందుకు యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌రావు మాట్లాడుతూ.. న్యాయవాదుల హక్కులు, న్యాయస్థానాల గౌరవం కాపాడడంలో బార్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కోర్టుల గౌరవాన్ని కాపాడుకోవడం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. సుప్రీంకోర్టులో జరిగిన సంఘటన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ అని అభిప్రాయపడ్డారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు పద్మ పండరి, సతీష్, నామ శ్రీకాంత్, నాగం సాయిబాబా, నామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

హక్కులను రక్షించడం అందరి బాధ్యత

కామారెడ్డిటౌన్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): చిన్నారుల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి నాగరాణి అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలసదనంను సందర్శించి అవగాహన కార్యక్రమం చేపట్టారు. బాలసదన్‌లో సంరక్షణలో ఉన్న పిల్లల ఆరోగ్యం, విద్య, ఇతర అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు న్యాయసంబంధిత అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో ప్రమీల, డీసీపీఓ స్రవంతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అంజయ్య, సీడబ్ల్యూసీ మెంబర్స్ ఖాజా నాజిముద్దీన్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


ఒక్క యాప్‌తో గైర్హాజరుకు చెక్..!

▸▸ వైద్యశాఖలో అబాస్ యాప్ ▸▸ మద్నూరు మండలంలో పక్కాగా అమలు ▸▸ అవకతవకలకు అవకాశం లేదిక

మద్నూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి డుమ్మాలు కొట్టే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి అబాస్ యాప్‌ను అమల్లోకి తెచ్చి తెలంగాణ ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ చెక్ పెట్టిన విషయం తెలిసిందే. ఇష్టం వచ్చినప్పుడు ఉద్యోగానికి వెళ్తాం, వెళ్లినప్పుడే రిజిస్టర్‌లో సంతకాలు పెడతాం అంటే కుదరదు. పనిచేసే చోటుకు వెళ్లి మొబైల్ ఫోన్‌లోని అబాస్ (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం) యాప్‌లో ముఖం చూపితేనే హాజరు పడుతుంది. ఈ విధానం గత నెల 1 నుంచి కొనసాగుతుండగా ఉమ్మడి మద్నూర్ మండలంలో అమలవుతోంది.

● **గతంలో ఆరోపణలు**

ఉమ్మడి మద్నూర్ మండలంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ దవాఖానాలలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది తమకు ఇష్టం వచ్చినప్పుడు వస్తూ, వెళ్తున్నారని గతంలో పలు ఆరోపణలు వచ్చాయి. సమయపాలన పాటించకుండా, వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారని, వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే వచ్చి మిగతా రోజులు అటెండెన్స్ వచ్చిన రోజు లిస్టులో వేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇంకొంతమంది క్షేత్రస్థాయి పరిశీలన సర్వేలు అంటూ విధులకు హాజరుకాని ఘటనలూ ఉన్నాయి.


మద్నూర్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి

● **యాప్ రాకతో హాజరు పక్కా**

అయితే ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త విధానంతో అధికారుల గైర్హాజరుకు పూర్తిగా చెక్ పడింది. ఈ యాప్ ఉద్యోగులు పనిచేసే ఆసుపత్రి పరిసరాల్లోనే ఓపెన్ అవుతుంది. మొబైల్ ద్వారా ఫేస్ రికగ్నేషన్ విధానంతో హాజరు నమోదు అవుతుంది. ఎక్కడి నుంచో ఈ యాప్ ఓపెన్ చేసి హాజరు వేయడానికి వీలు ఉండదు. అలా చేస్తే అటెండెన్స్ పడదు. దీంతో హాజరులో అవకతవకలు చేసేందుకు అవకాశం లేదు.


మద్నూర్‌లో వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వాల్మీకి జయంతి వేడుకలు

మద్నూర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని మహర్షి వాల్మీకి ఆలయంలో ఆయన జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదమంత్రోచ్ఛరణలతో అభిషేకం పూజలు, హారతి మహోత్సవం జరిపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అశోక్, సాయిలు, నాందేవ్ మేస్త్రీ, యాదు మేస్త్రీ, రాహుల్, తులసీరాం, రాజు, సాహెబ్ రావ్, సాయిలు, లక్ష్మణ్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

9న ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

సుభాష్‌నగర్, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా అండర్-19 బాలికల జట్టు ఎంపికలను ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ తెలిపారు. నగరంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 10గంటలకు ఈ ఎంపికలను నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12, 13వ తేదీలలో సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మరింత రాణించి జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని కోరారు.

నేడు మండల కేంద్రంలో పోషణ మాసోత్సవం

నవీపేట, అక్టోబరు7, (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నవీపేట మండల కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్‌లు రాధాలక్ష్మి, భాగ్యలక్ష్మిలు తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు స్థానిక రైతు వేదికలో జరిగే ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు హాజరుకావాలని వారు కోరారు. తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

గాంధీ గంజ్‌లో గలీజ్ దందా..!

(5వ పేజీ తరువాయి)

కూరగాయలు విక్రయించడంతో ట్రాఫిక్ జామ్ అవుతుందని అందరిని గాంధీగంజ్‌లోకి మార్చారు. ఇప్పటికే గాంధీగంజ్‌లో లైసెన్సు పొందిన కూరగాయల వ్యాపారులు విక్రయాలు నిర్వహిస్తున్నారు. రోడ్డుపై కూరగాయలు అమ్మేవారిని కూడా గంజ్‌లోకి అనుమతించడంతో లైసెన్సు ఉన్న కూరగాయల వ్యాపారులు లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవడం లేదు. ఇదే అదనుగా మార్కెట్ కమిటీకి చెందిన ముఖ్య నేత రోజువారి వసూళ్ల పర్వానికి తెర లేపాడు. గాంధీగంజ్‌లో కూరగాయల వ్యాపారులు 90 మంది ఉండగా వారి నుంచి రోజుకు రూ.100 చొప్పున, పండ్ల దుకాణాలు, ఇతర తోపుడు బండ్లు 60కి పైగా ఉండగా వారి నుంచి రోజుకు రూ.200ల చొప్పున సదరు నేత వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదివరకు గంజ్‌లో పనిచేసిన వారిని తొలగించి ఇద్దరిని తన సొంత మనుషులను ఏర్పాటు చేసుకొని కూరగాయల వ్యాపారులతో పాటు తోపుడు బండ్ల వ్యాపారులతో రోజువారి వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు అమ్మేవారికి ఎటువంటి లైసెన్సులు లేకుండానే షాపుల నిర్వాహణకు సదరు నేత అనుమతి ఇచ్చి రోజువారి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పాత వ్యాపార సముదాయంపై కన్ను

గాంధీగంజ్‌లో లైసెన్స్‌డ్ కూరగాయల వ్యాపారులకు ఒక వ్యాపార సముదాయాన్ని కేటాయించారు. సదరు నేత ఆ సముదాయాన్ని రూములుగా మార్చి ఒక్కో షట్టర్‌ను ఒక్కో రేటుకు బంగారు దుకాణాలకు కేటాయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గాంధీగంజ్‌లో మరోవైపు ఉన్న షెడ్డులో ప్రస్తుతం గోడలతో రూములు కడుతూ లైసెన్స్‌డ్ కూరగాయల వ్యాపారులను అందులోకి తరలించి పాత సముదాయాన్ని బంగారు దుకాణాలకు కేటాయించేందుకు సదరు నేత ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. బంగారు దుకాణాలను తనకు నచ్చిన వారికి కేటాయిస్తూ అందిన కాడికి దోచుకునేందుకు సదరు నేత ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇళ్ల కోసం వసూలు చేసిన డబ్బులు వెనక్కి

నిజామాబాద్ 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్‌లో మంగళవారం 'వసూల్ రాజా' శీర్షికన ప్రచురితమైన కథనంపై నిజామాబాద్ మార్కెట్ కమిటీలో పెద్ద చర్చ జరిగింది. కార్మికులకు ఇండ్ల కేటాయింపుల విషయంలో వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కథనం రావడంతో డబ్బులు వసూలు చేసిన వారు కార్మికులకు తిరిగి డబ్బులు ఇచ్చినట్లు తెలుస్తుంది. డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు గురించి డబ్బుల వసూళ్ల విషయంపై నిఘా వర్గాలు సైతం ఆరా తీశాయి.

బస్సు ఆలస్యంపై విద్యార్థినుల గుస్సా

- సమయానికి సర్వీసులు నడపాలని నిరసన
- స్కూళ్లు,కాలేజీలకు ఆలస్యం అవుతోందని ఆవేదన



కందకుర్తిలో బస్సును అడ్డుకున్న విద్యార్థినులు

రెంజల్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గ్రామానికి సమయానికి బస్సు నడపడం లేదని మంగళవారం ఉదయం గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సును విద్యార్థినులు అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సు సమయానికి నడపకపోవడంతో స్కూల్‌కు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని మండిపడ్డారు. బస్సుకు అడ్డంగా స్కూల్ బ్యాగులతో బైఠాయించి నిరసన తెలిపారు. ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సులు నడపకపోవడంతో స్కూల్‌కు సమయానికి చేరుకోలేకపోతున్నామని, ఉదయం 8గంటలకు వచ్చే బస్సు 11గంటలకు వస్తోందని, కందకుర్తి నుంచి రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల, మోడల్ స్కూల్‌కు, కళాశాలకు వెళ్లలేక తరగతులకు ఆలస్యం అవుతోందని వాపోయారు. ఉదయం 11గంటలకు బస్సులు వస్తే ఎలా వెళ్లేదని మండిపడ్డారు. అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం సకాలంలో బస్సులు నడపాలని కోరారు.

హుస్సామ్.. పసిడి పంచ్

- బీఎఫ్ఐ చాంపియన్‌గా జిల్లా బాక్సర్
- క్రీడాభిమానుల హర్షం



బంగారు పతకంతో హుస్సాముద్దీన్

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ మహమ్మద్ హుస్సాముద్దీన్ మళ్లీ తన పతకాల వేటను మొదలు పెట్టాడు. గత కొన్ని రోజులుగా కఠోర సాధన చేసి తన ప్రతిభను రింగ్‌లో చాటాడు. చెన్నైలో జరుగుతున్న బాక్సింగ్ ఫెడరేషన్ ఇండియా కప్‌లో తన సత్తాచాటాడు. 55-60 కేజీల విభాగంలో పోటీపడి తన ప్రత్యర్థులను మట్టి కరిపించాడు. మొదటి పోటీ నుంచి తనదైన పంచ్‌లతో ప్రత్యర్థులను కోలుకోకుండా పోరాడి విజయం సాధించాడు. నలుగురు ప్రత్యర్థులను ఓడించి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఫైనల్ పోటీల్లో ప్రత్యర్థి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన బాక్సర్ సాగర్ జకర్ ను 5-0 తో ఓడించి బీఎఫ్ఐ చాంపియన్‌గా నిలిచాడు. హుస్సాముద్దీన్ సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు తరఫున ప్రాతినిధ్యం వహించాడు. బీఎఫ్ఐ చాంపియన్‌గా నిలవడం పట్ల జిల్లాకు చెందిన క్రీడాభిమానులు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

ఇందల్వాయి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విభేదాలను పక్కనపెట్టి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడుతూ.. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారికే పార్టీ పదవులు ఇస్తుందని ఎవరికి టిక్కెట్ ఇచ్చిన కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడగాలని కోరారు. మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీ సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, శేఖర్‌గౌడ్, కంచెట్టి గంగాధర్, మునిపల్లి సాయిరెడ్డి, పోలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నర్సయ్య, రామ్‌చందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

వేల్పూర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌కు చెందిన జంబరతి శ్యామ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రశాంతన్న యువసేన సభ్యులు మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. శ్యామ్ మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని మృతుడి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. తాము అండగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. ఏదైనా సమస్య వస్తే తమను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతన్న యువసేన సభ్యులు రేగుల్ల రాములు, ప్రతాప్, సత్యం, శ్రీనివాస్, నవీన్, అశోక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో అధికారికంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి హాజరయ్యారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..



కమిషనరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు డీసీపీ

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌కమిషనరేట్‌లో అదనపు డీసీపీ(ఏఆర్) రామచందర్‌రావు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షి వాల్మీకి అద్భుతమైన గ్రంథాన్ని మనకు అందించాడని రామచందర్‌రావు అన్నారు. సమాజ శ్రేయస్సుకు అవసరమైన జీవనసూత్రాలు రామాయణం ద్వారా వాల్మీకి బోధించారని తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, బషీర్ అహ్మద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, తిరుపతి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వీరయ్య, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వర్ని చౌరస్తాలోని వాల్మీకి రామాలయంలో ఘనంగా వాల్మీకి జయంతిని నిర్వహించారు. మంగళవారం వాల్మీకి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతీ సంవత్సరం జయంతి వేడుకలను సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుతామని సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, కిరణ్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణం రచించి సమాజానికి ప్రత్యేక గుర్తింపుతో పాటు గురువుగా మార్గదర్శకంగా నిలిచాడని అన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఎస్సారెస్పీకి భారీ వరద

మెండోరా, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి భారీగా జలాశయంలోకి ఇన్ఫ్లో వస్తోం ది. దీంతో ప్రాజెక్టు అధికారులు 37 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 2,36,460 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా.. అధికారులు 2,37,730 క్యూసెక్కుల నీటినిదిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 అడుగులు (80.053 టీఎంసీలు) నీటినిల్వ ఉంది. వరద నీరు భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నుండి ఆయా కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు, వేస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగిరథకు 231 క్యూసెక్కులు, అదనంగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరైపోతోంది. మొత్తం 1,87,730 క్యూసెక్కుల నీరు వరద గేట్ల ద్వారా నీరు విడుదల జరుగుతోంది.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు

● మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి

మోపాల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న హమాలీలు, గుమస్తాలు, దాడువాయిలు, చాటా కార్మికులు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక పత్రికలో వచ్చిన విధంగా దళారులకు డబ్బులు ఇచ్చినట్లు నిరూపితం అయితే వారి ఇళ్లను రద్దు చేస్తామని తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఇళ్లు లేని కార్మికులకు ఇవ్వాలని ఒప్పించామని చెప్పారు. అందులో భాగంగా ఆయా యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. కార్మికులకు ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేస్తుందని, దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. ఇళ్లు మంజూరు అయిన తర్వాత అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయిస్తామన్నారు. కార్మికులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని చైర్మన్ గంగారెడ్డి కోరారు.

బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకుంటే తరిమికొడతాం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకునే వారిని తరిమికొడతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. పులాంగ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బీసీలకు ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తే కొందరు అగ్రవర్ణాలు కోర్టులో కేసులు వేయడం రాజ్యాంగ ద్రోహమే అవుతుందన్నారు. బీసీలకు ద్రోహం చేసేవారిని ఎవరిని వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కొన్ని వేల సంవత్సరాల నుంచి అప్రకటిత రిజర్వేషన్‌లను పొందుతున్న అగ్రవర్ణాలు ఇప్పుడు బీసీలకు వస్తున్న రిజర్వేషన్‌లను చూసి ఓర్వలేకపోవడం భారతీయ తత్వాన్ని అవమాన పర్చడమేనని పేర్కొన్నారు. బీసీలు ఏనాడు అగ్రవర్ణాలకు ఇచ్చిన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లను వ్యతిరేకించలేదన్నారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లపై బీసీ కులస్తులు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న 42శాతం రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తూ కొందరు అగ్రకులాల వారు కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో దేవేందర్, శంకర్, అజయ్, శ్రీలత, శ్రీనివాస్, జయ, రుక్మిణి, సదానంద్, బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ నారాయణ కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న శేఖర్‌గౌడ్

ఇందల్వాయి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గతనెల 11న గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ లక్కవత్రి నారాయణ కుటుంబానికి పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది మంగళవారం నారాయణ భార్య లక్ష్మికి అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఇటీవల నారాయణ కుటుంబాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పరామర్శించిన సమయంలో లక్ష రూపాయలు ఇస్తానని హామీ ఇవ్వగా.. ఈ మేరకు ఆయన మంగళవారం కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌ఛార్జ్ కేవీ వెంకటరమణ, స్టాఫ్ రిపోర్టర్ ఆంజనేయులు, కాంగ్రెస్ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, సీనియర్ నాయకుడు కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలసాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి



పులాంగ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నేతలు

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు చొక్కం దేవిదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాన న్యాయమూర్తిపై దాడికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన దళిత వ్యక్తిని మనువాదులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఆయనపై దాడిని వ్యక్తిపై కాకుండా మొత్తం న్యాయవ్యవస్థపై రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. దేశంలోని అన్ని ప్రజాసంఘాలు దాడిని ఖండించాలన్నారు. ఉదయ్‌కుమార్, వినయ్‌కుమార్, చంద్రకాంత్, శంకరయ్య, నాగారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, సెప్టంబార్ 07 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడిని జిల్లా బార్ అసోసియేషన్ సభయయలు ఖండించారు. మంగళవారం కోర్టులో అత్యవ సర సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. న్యాయమూర్తిని, బెంచ్‌ని అందరూ గౌరవించాలన్నారు. న్యాయవాది రాకేష్ కిషోర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రతినిధులు కోర్టు విధులు బహిష్కరించారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంజర్ల సురేష్, ప్రధాన కార్యదర్శి మానిక్ రాజు సీనియర్ న్యాయవాదులు గంగాప్రసాద్, రమేశ్, సదనంద్ గౌడ్, బార్ అసోసియేషన్ సభ్యులు నారాయణ, దాస్, రుక్సిరాణి, మంజిత్ సింగ్, శ్రిమన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి

నిధులు రాగానే బకాయిలు చెల్లిస్తాం



మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ

బోధన్,అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): బిల్లుల కోసం హైకోర్టుకు ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ స్పందించారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. నిధులు రాగానే కాంట్రాక్టర్‌కు రావాల్సిన బకాయి బిల్లులు చెల్లిస్తామన్నారు. హైకోర్టుకు అప్పీలుకు ఫైల్ తయారు చేస్తున్నామని నేడు హైకోర్టులో అప్పీల్ చేస్తామన్నారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం నిజమేనని దీనిని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులకు నివేదించామన్నారు. ఉన్నతాధికారుల స్పందన మేరకే తాను వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుండి నిధులు రాగానే కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలు చెల్లిస్తామన్నారు.

104 ఉద్యోగులను ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో 104లో పనిచేస్తున్న ఉద్యోగులను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి సంబంధించిన పోస్టులలో స్థానం కల్పించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీకి వినతిపత్రం అందజేశారు. జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆమెను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న సిబ్బందిని కామారెడ్డి జిల్లాకు సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. వారిని నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఆరు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. జీతాలు లేకపోవడంతో స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయిలు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కార్యక్రమంలో 104 జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి రమేష్, ప్రసాద్, సంధ్య, కృష్ణ, గంగాధర్, జీవన్‌రెడ్డి, మోహన్, రాజశేఖర్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలను తొలగించిన అధికారులు

మోపాల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): చెట్టు కాదు కరెంటు స్థంభం అనే ఆంధ్రజ్యోతి కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం నుంచి తిర్మన్‌పల్లి వెళ్లే దారిలో విద్యుత్ స్థంభం పిచ్చిమొక్కలతో దర్శనమిచ్చింది. ఆంధ్ర జ్యోతి కథనంతో విద్యుత్ అధికారులు స్పందించి మంగళవారం జేసీబీ సహాయంతో స్తంభం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, తీగలను తొలగించారు.



పాలస్తీనాకు మద్దతుగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ పాలస్తీనాకు మద్దతుగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ద్వారకనగర్ ఐఎఫ్‌టీయూ నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వీక్లీబజార్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ ఇజ్రాయిల్ మారణహోమం వల్ల 6వేల మందికి పైగా గాజా ప్రజలను పొట్టనపెట్టుకున్నారని అన్నారు. ఈ దాడుల్లో చిన్న పిల్లలు సైతం చనిపోయారని తినడానికి తిండి, తాగడానికి నీళ్ల లేకుండా గాజా ప్రజలు అవస్థలకు గురవుతున్నారని అన్నారు. ప్రపంచ దేశాలు గాజా ప్రజలకు అవసరమయ్యే ఆహారాన్ని అందించి మానవతం చాటుకోవాలని అన్నారు.ఈ ర్యాలీలో జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, సాయిబాబా, గంగాధర్, మోహన్, భారతి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్ వర్ధంతి



కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

సుభాష్‌నగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహనీయుడు కొమరం భీమ్ అని మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విగ్రహాల పార్క్ వద్ద కొమరంభీమ్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొమరంభీమ్ 85వ వర్ధంతిని పురస్కరించుకొని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల అభ్యున్నతి కోసం పోరాటం చేస్తూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమణం పొందిన గొప్ప నాయకుడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొమురం భీమ్ వర్ధంతిని సెలవు దినంగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి : మిరాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కాంతారా చాప్టర్-1 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : ఓజి (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఓజి (తెలుగు) (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : కాంతారా చాప్టర్-1 (11.00)
: ఇడ్లీ కొట్టు (1.50, 4.35, 10.35)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (1.30, 4.30, 7.30, 10.25)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : కాంతారా చాప్టర్-1 (9.00, 12.25, 3.50, 7.15, 10.40)
స్క్రీన్-2 : ఓజి (తెలుగు) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (10.10, 7.35)
: సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (1.35, 11.00)
: ఇడ్లీ కొట్టు (4.30)
స్క్రీన్-4 : సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (10.05, 7.50)
: కాంతారా చాప్టర్-1 (1.00)
: మిరాయి (4.25)
: ఇడ్లీ కొట్టు (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,25,400	రూ.1,15,200	రూ.1600

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285

